# మన గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదు



జమ్మికుంట: ఆత్మీయ సమ్మేళనంలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

- **మెజార్టీ కోసమే పోటీ పడాలి**
- **బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ప్రచార ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి**
- **జమ్మికుంటలో యువతతో ఆత్మీయ సమ్మేళనం**
- **30 రోజులు నా కోసం పనిచేయండి.. ఐదేళ్లు మీ కోసం పనిచేస్తా : ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి**

జమ్మికుంట, అక్టోబర్ 27: బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదని, రాష్ట్రంలో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ఖాయమని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల్లో యువత ఒక సైనికుల్లా పనిచేయాలని, గెలుపంతా మీ చేతుల్లో ఉందని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆ పార్టీ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఏర్పాటు చేయగా, శుక్రవారం ఆయనతో కలిసి ఇన్‌చార్జి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ 'యువ గర్జన' పేరిట యువతతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. పనిచేసే యువకుడు, సమస్యలను పరిష్కరించే నాయకుడు పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకోవాలని, హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ గెలుస్తుందని సర్వేలు చెప్పాయని, కేవలం మెజార్టీ కోసమే పోటీ పడాలని పేర్కొన్నారు. హుజూరాబాద్ ఉద్యమాల గడ్డ అని, చైతన్యానికి మారుపేరని, ఎన్నికల రణరంగంలో దిగిన తర్వాత గెలిచి తీరాల్సిందేనన్నారు. కౌశిక్ ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని వర్గాలను కలిశారని, మరోసారి అందరం కలుసుకుందామని చెప్పారు. అయితే నాయకులు, కార్యకర్తలు ఎక్కడివారు అక్కడే ప్రచారం చేయాలని, పార్టీ కోసం పాటుపడాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మి మోసపోవద్దని, అరిగోస పడ్తమని సూచించారు. హుజూరాబాద్ జిల్లా ఎన్నడో అయ్యేదని, జిల్లా కాకుండా అడ్డుకున్నదెవరో ప్రజలకు తెలుసన్నారు. జిల్లా ఏర్పడితే ఎన్నో సౌకర్యాలు వచ్చేవని పేర్కొన్నారు. అయినా, ప్రజల ఆకాంక్షను సీఎం దృష్టికి తీసుకెళ్లానని, మంచి సమయంలో సీఎం నుంచి మంచి నిర్ణయం వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ ఉంటే.. ఇక్కడ వేరే పార్టీ నాయకుడిని గెలిపించుకుంటే అభివృద్ధి జరగదని తెలిపారు. హుజూరాబాద్ మరోసారి నష్టపోవద్దంటే.. ప్రగతి సాధించాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకు తీరాలన్నారు. కుల రాజకీయాలు చేసే నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

### 30 రోజులు పనిచేయండి.. ఐదేళ్లు మీ కోసం పనిచేస్తా

నా బలం.. బలగం మీరే. 30 రోజులు నా కోసం పనిచేయండి. ఐదేళ్లు నేను మీ కోసం పనిచేస్తా. మాట తప్ప. మడమ తిప్ప. మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంట. ఎక్కడి వాళ్లు అక్కడే పనిచేయాలి. ప్రతి గ్రామంలో మీరే కథానాయకులు కావాలి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలి. అంతిమంగా విజయం మనదే కావాలి. దేశ చరిత్రలో ₹37 వేల కోట్లు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఎక్కడా లేదు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, 24 గంటల ఉచిత కరెంటు ఎందుకియ్యడం లేదు? కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రమంతా సస్యశ్యామలమైంది. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో బాగున్నది. ప్రజా వ్యతిరేక ప్రతిపక్షాలు మనకు అవసరం లేదు. ఈ ఒక్కసారి నాకు అవకాశం ఇవ్వండి. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తా. వావిలాల, చల్లూరు, శనిగరం, ఉప్పల్‌ను మండలాలుగా, కమలాపూర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తా. కాంగ్రెస్, బీజేపీ సర్వేల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని తేలింది. మెజార్టీ కోసం పనిచేయాలి.

*- పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్*

### ప్రతిపక్షాలను తరిమికొట్టాలి



బీజేపీ, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పార్టీలు. వచ్చే ఎన్నికల్లో వాటిని తరిమి కొట్టాలి. కాంగ్రెస్ రైతుబంధుపై ఈసీకి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు. రైతులు బాగుపడుతుంటే ఓర్వలేకపోతున్నది. ప్రజల్లో చైతన్యం కలిగించాలి. ప్రభుత్వ పథకాలను వివరించాలి. యువకుడు పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుందాం. హుజూరాబాద్‌కు భవిష్యత్ ఉంటది. ఇప్పటి వరకు ప్రతిపక్షాలు అభ్యర్థులనే ప్రకటించలేదు. అసలు పోటీ చేస్తారో లేదో తెలియదు. మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి. హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలి.

*- బండ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్*

### కార్యకర్తలే కథానాయులు



యువత చేతిలోనే భవిష్యత్ ఉంది. కౌశికన్న ఇచ్చిన పిలుపుతో ఈరోజు ఇంత మంది రావడం అభినందనీయం. మనం ఇలాగే ముందుకు సాగాలి. ఎక్కడి వారు అక్కడే ఉండాలి. గ్రామాల్లో తిరగాలి. ప్రజలతో మమేకం కావాలి. చర్చ పెట్టాలి. సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు నిద్రపోవద్దు. ప్రతి కార్యకర్త ఒక కథానాయకుడు కావాలి. వ్యక్తిగత ప్రతిభను చూపాలి. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి.

*- పింగిళి రమేశ్, కేడీసీసీబీ వైస్ చైర్మన్*

### గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుంటం



స్వరాష్ట్రం కోసం కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో ఉద్యమానికొచ్చినం. దెబ్బలు తిన్నం. జైళ్లకెళ్లినం. రాష్ట్రాన్ని సాధించుకున్నం. సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ గొప్పగా తీర్చిదిద్దుతున్నరు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిస్తున్నరు. మేమంతా ఉద్యమ బిడ్డలం. పనిచేస్తూనే ఉంటం. గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుంటం. కాపాడుకుంటం. హుజూరాబాద్‌లో గెలిపించుకుంటం. మాకు పదవులొద్దు. మాకేమన్న కష్టమొస్తే మేమున్నామంటే చాలు..

*- జువ్వాజీ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు (ఇల్లందకుంట)*

### బీఆర్ఎస్‌తోనే యువత



కౌశిక్ అన్న ఒక్క పిలుపిస్తే చాలు.. ఇక్కడికచ్చినం. నియోజకవర్గంలోని యువతంతా బీఆర్ఎస్‌తోనే ఉన్నది. ఉంటం కూడా. పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేస్తం. గ్రామాల్లోనే తిరుగుతం. పథకాలను వివరిస్తం. గతంలో జరిగిన పొరబాటు ఈసారి జరుగకుండా చూసుకుంటం. ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతం.

*- అనురాగ్, బీఆర్ఎస్ యువ నాయకుడు (హుజూరాబాద్)*

### యుద్ధంలోని సైనికుల్లా పనిచేస్తాం



పార్టీలు వస్తుంటయ్. పోతుంటయ్. ఎప్పటికీ ఉండేది.. పనిచేసే బీఆర్ఎస్ ఒక్కటే. పనిచేసే పార్టీని కాపాడుకుంటం. అందుబాటులో ఉండే కౌశికన్ననే గెలిపించుకుంటం. సీఎం మ్యానిఫెస్టో అదిరింది. ప్రతిపక్షాల దిమ్మతిరిగింది. మూడోసారి సీఎం కేసీఆరే. ఇక్కడికచ్చిన యువతంతా యుద్ధంలోని సైనికుల్లా పనిచేయాలి. పనిచేస్తం కూడా. పెద్దలు అందించే దిశానిర్దేశాన్ని పాటిస్తూ ఐక్యతతో ముందుకు సాగుతాం.

*-శివ, హుజూరాబాద్, బీఆర్ఎస్ యువ నాయకుడు*



మానకొండూర్: కార్యకర్తల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఖలీల్ కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలి

- **ఆ పార్టీ యాభై ఏండ్లలో ఏంచేసింది? ఇప్పడేం చేస్తది?**
- **వాళ్ల ఆరు గ్యారెంటీలు బూటకం**
- **వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే**
- **మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్**

మానకొండూర్, అక్టోబర్ 27: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్న కాంగ్రెస్‌ను రాబోయే ఎన్నికల్లో ప్రజలు తరిమి మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్ గౌడ్ అధ్యక్షతన మానకొండూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిల సమావేశానికి ఎమ్మెల్యే రసమయి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ యాభై ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ అన్నిరంగాల్లో దోపిడీకి గురైందన్నారు. ఇప్పుడు మోస పూరిత హామీలతో అధికారంలోకి రావడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ కుటిల బుద్ధిని ఎండగట్టాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు వట్టి బూటకమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ తీసుకువెళ్లాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలిసుకుని వారికి ప్రభుత్వ మ్యానిఫెస్టో వివరించాలని చెప్పారు. కష్టపడి పనిచేసే కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్బీఎస్ మండల కన్వీనర్ రామంచ గోపాల్‌రెడ్డి, మానకొండూర్, ఊటూర్ సహకార సంఘాల అధ్యక్షులు నల్ల గోవిందరెడ్డి, ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### 65 వేల మెజార్టీతో గెలుస్తా

నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి 52 వేల సభ్యత్వం ఉంది. 137 మంది సర్పంచులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. దీనికి తోడు 58 వేల మంది సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధిస్తా. 65 వేల మెజార్టీతో గెలుస్తా. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 25 వేల ఓట్లు వస్తే, గెలిచిన తర్వాత నా ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేస్తా.

*- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్*



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

# రైతాంగానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి

- **రైతుబంధు ఆపాలన్న కాంగ్రెస్‌కు రైతులు బుద్ధి చెప్పాలి**
- **బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్**

కార్పొరేషన్, అక్టోబర్ 27: రైతు బంధును ఆపాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకుందని విమర్శించారు. మొన్నటి వరకు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతు బంధును ఆపాలని ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. దేశంలో రైతులు ఆత్మహత్య చేసుకోవడానికి కారణం కాంగ్రెస్ నాయకులేనన్నారు. తెలంగాణను బీడు భూములుగా మార్చి రైతులు వలస పోయే స్థితి తీసుకువచ్చింది కాంగ్రెస్ అని విమర్శించారు. తెలంగాణలో రైతులను రాజు చేయ్యాలన్న ఆలోచనతో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు, ఉచితంగా 24 గంటల కరెంటు, రైతు బంధు, బీమా అందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 13 సార్లు రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని గుర్తు చేశారు. యాసంగి పంటకు సంబంధించి పెట్టుబడి కోసం మళ్లీ రైతులు అప్పులు చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసపూరిత కుట్రలను రైతాంగం గుర్తించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే గ్రామాల్లోకి రాకుండా రైతాంగం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కర్ణాటక ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడం లేదని, వారిని నమ్మి మోసపోవద్దని అక్కడ రైతులు చెబుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇప్పటికైనా రైతులపై కుట్రలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గందె కల్పన, గడ్డం ప్రశాంత్‌రెడ్డి, ఆరె రవి, హరీశ్, సత్తినేని శ్రీనివాస్, సాయి, చందు, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.